ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102
సంపుటి : 02 సంచిక : 129 చీఫ్ ఎడిటర్.. కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, పేజీలు : 08, వెల రూ. 1/- మంగళవారం - 09 - జూన్ - 2026



రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి

- రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తున్నాయి
- 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి
- బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూములను సర్వే చేశాం
- గొడ్డలి పట్టుకునే చేతులకు రైతుల బాధలు గుర్తొస్తాయా?

## పరీక్షలంటే తెలియని వారు కూడా
# బురద జల్లుతున్నారు

### గొడ్డలి పార్టీకి రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత లేదు

- ★పశ్చిమగోదావరి జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం
- ★ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములు కాజేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ
- ★భద్రతా ఫీచర్లతో రాజముద్ర వేసి కొత్త పాస్‌బుక్కులు ఇస్తున్నామని వెల్లడి
- ★రికార్డులు ఫోర్జరీ చేసిన ఎమ్మెల్యేపై వైసీపీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అంటూ ప్రశ్న



అమరావతి: పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక దాదాపు మిగతా 2 లో

## ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ..
## రూ.124 కోట్లతో ఆధునికీకరణ పనులు!

- 46 ఏళ్ల తర్వాత ధవళేశ్వరం బ్యారేజీకి పూర్తి స్థాయిలో అప్‌గ్రేడేషన్‌తతత





## రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని
# కాగ్ బట్టబయలు చేసింది

### తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వ్యాఖ్య

- నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర
- కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా బొగ్గు ఉండేది

హైదరాబాద్: నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై మిగతా 2 లో

## ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు
# చెందినవారేనన్న రేవంత్ రెడ్డి

### రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టిన శివసేన(యూబీటీ)



- దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్ రెడ్డికి 'ఇండీ' మిత్రపక్షం హితవు!

## ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్
# ఏర్పాటును పరిశీలించండి

### పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి అరుదైన లోహాలు వెలికితీసేందుకు, సాంకేతికతను అందించడంలో భాగస్వాములు కావాలి

- ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ ఏర్పాటుకు చొరవ చూపండి
- 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఈ మ్యూజియం ఏర్పాటైంది.



అమరావతి: రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఉన్న ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్, రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను

## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు..
# సస్పెండ్ చేసిన ప్రభుత్వం!

### బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు

- భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలింది
- బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది



హైదరాబాద్: హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డులో 2013 నుంచి 2018 వరకు మిగతా 2 లో




## ఆంధ్రా పేపర్ మిల్స్‌కు
# షోకాజ్ నోటీసులివ్వండి
# అధికారులకు పవన్ ఆదేశం

- ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు
- రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు
- నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలింది

అమరావతి: గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు మిగతా 2 లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు
# 'ఇండియా' కూటమి డిమాండ్..




### ఢిల్లీ భేటీలో 5 కీలక నిర్ణయాలు!

ఢిల్లీ: నీట్, సీబీఎస్ఈ పరీక్షల వివాదాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని 'ఇండియా' కూటమి నేతలు డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశం ముగిసిన అనంతరం మిగతా 2 లో







## 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణం

- స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు
- తెలంగాణలో స్కూళ్ల కుదింపుపై మొదలైన రాజకీయ దుమారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత

## పెళ్లికి ముందు లైంగిక సంబంధాలపై
# సుప్రీంకోర్టు కీలక తీర్పు

### కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు

- పెళ్లికి ముందు మేజర్లు ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకుంటే తప్పుకాదన్న కోర్టు
- మారుతున్న కాలంలో ఇది సాధారణమైందన్న అత్యున్నత న్యాయస్థానం
- దీని ఆధారంగా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న కోర్టు
- ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశం



ఢిల్లీ: ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని

VIGNAN PATRIKA APTEL/2024/89102
విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)



## జులైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం: పీయూష్ గోయల్

ఢిల్లీ: సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది. వచ్చే జులైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరు దేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ.. చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తి స్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జులై మధ్య నాటికి ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలు చేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ, వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరు దేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. తఅమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో.. ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే.. జులై మధ్యకల్లా ఇరు దేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

## ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ.. రూ.124 కోట్లతో ఆధునికీకరణ పనులు!

గోదావరి: గోదావరి డెల్టా జిల్లాల జీవనాడి, చారిత్రాత్మక ధవళేశ్వరం బ్యారేజీ (సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ) ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఈ ఐకానిక్ నిర్మాణానికి దాదాపు 46 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు పూర్తి స్థాయిలో అప్‌గ్రేడ్ లభించబోతోంది. బ్యారేజీ భద్రతను పెంచడం, నీటి నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా గోదావరి డెల్టా పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం. ధవళేశ్వరం బ్యారేజీకి చివరిసారిగా 1980లో పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేశారు. అయితే దశాబ్దాలు గడుస్తున్న కొద్దీ బ్యారేజీలోని పలు భాగాలు బలహీనపడ్డాయి. ముఖ్యంగా ఇందులోని 117 గేట్లు తీవ్రంగా తుప్పు పట్టిపోవడంతో, వాటి భద్రతపై నిపుణుల కమిటీలు తమ నివేదికల్లో పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో అలర్ట్ అయిన ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తలకెత్తుకుంది. ఈ ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వం మొదట సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను ఆహ్వానించింది. చివరకు 'బేకమ్' (దీవష్ఛిఎ) కంపెనీ రూ.124.34 కోట్లకు ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా పాతబడిపోయిన, తుప్పు పట్టిన 117 గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కొత్త గేట్లను అమర్చనున్నారు. ఈ ఆధునికీకరణ పనులన్నింటినీ రాబోయే రెండేళ్ల కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులు పూర్తయితే బ్యారేజీ నీటి నిల్వ, విడుదల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ రంగానికి, దీర్ఘకాలిక నీటి అవసరాలకు ఈ ప్రాజెక్ట్ ఒక పెద్ద బూస్ట్‌లా నిలవనుంది. అవసరమైన అధికారిక ఫార్మాలిటీస్ ముగిసిన వెంటనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నాయి.

## ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో చేసిన 'ఉత్తర-దక్షిణ భారత' వ్యాఖ్యలపై 'ఇండీ' కూటమి మిత్రపక్షం శివసేన (యూబీటీ) తీవ్రంగా స్పందించింది. దేశాన్ని రాష్ట్రాల వారీగా ముక్కలు చేసేలా మాట్లాడటం ఏమాత్రం సరికాదని హితవు పలికింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రాంతీయ విభేదాల కంటే జాతీయ ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ వివాదంపై శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే మాట్లాడుతూ.. "మన భారతదేశం ఓ అందమైన పూలగుచ్ఛం లాంటిది. అందులో ఒక్కో పువ్వు ఒక్కో రంగులో, ఒక్కో సువాసనతో ఉంటుంది. కానీ అవన్నీ కలిస్తేనే ఒక అందమైన గుచ్ఛం అవుతుంది" అని దూబే వ్యాఖ్యానించారు. భౌగోళిక, భాషా వ్యత్యాసాలతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన గౌరవం దక్కాలని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం వస్తే మనం ఉత్తర భారతం, దక్షిణ భారతం అని చూసుకోమని దూబే వ్యాఖ్యానించారు. మనమందరం భారతీయులుగానే నిలబడతామని, రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత అయినప్పటికీ కూటమి భాగస్వామ్య పక్షంగా దేశ సమగ్రత విషయంలో తాము రాజీపడేది లేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాబోవని ఆశిస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనని.. దక్షిణాదిని ప్రాతినిధ్యం వహించే బలం బీజేపీకి లేదని ఆరోపించారు. దక్షిణ భారతదేశ ప్రజలు ఈ దేశంలో 'రెండో శ్రేణి పౌరులుగా' బతకడానికి ఇష్టపడరని అనడం చర్చనీయాంశంగా మారింది.

## రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి

అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తున్నాయని.. దీని ద్వారా 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గ పరిధిలోని సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన 'మీ భూమి.. మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూములను సర్వే చేశామన్నారు. ఎవరైనా హ్యాక్ చేసినా వెంటనే తెలిసిపోతుందని చెప్పారు. రైతుల సమక్షంలో సర్వే చేసి ఈకేవైసీ తీసుకున్నామని వివరించారు. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని.. 26.46 లక్షల మందికి పట్టాదారు పాసు పుస్తకాలిచ్చామన్నారు. "మెగా డీఎస్సీ నిర్వహించి 16,500 మందికి టీచర్ పోస్టులిచ్చాం. ఎన్ని కుట్రలు పన్నినా ఏడాదిలోగా ఉద్యోగాలు భర్తీ చేశాం. గొడ్డలి పార్టీ చేసేవన్నీ తప్పుడు ప్రచారాలే. నేరాలు- ఘోరాలు వాళ్లే చేసి.. ఎదుటివాళ్లపై వేస్తారు. బాబాయ్‌ని చంపేసి గుండెపోటుగా చిత్రీకరించారు. ఇక్కడి నుంచి గొడ్డలి పార్టీ నేతలు తెలంగాణకు కూడా వెళ్లారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల ఆస్తులు కొట్టేశారు. ఇలాంటి నేతలను గొడ్డలి పార్టీ ఎందుకు సస్పెండ్ చేయలేదు. ఇక్కడ వాళ్ల ఆటలు సాగవని.. తెలంగాణలో రికార్డులు తారుమారు చేశారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతుల బాధలు గుర్తుకురావు. కోడికత్తి డ్రామాలాడే వారికి వరి కోతలు తెలియవు. గంజాయి బ్యాచ్‌ను ఓదార్చే వారికి సాగు తెలియదు. ఆలయాలపై దాడి చేసేవాళ్లకు ప్రజల మనోభావాలు తెలియవు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించాలని చూశారు.. ఈ జన్మలోనే వారిని ఆ దేవుడు శిక్షిస్తాడు." అని చంద్రబాబు అన్నారు.

## రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసింది

కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో 'బొగ్గు' అంటే కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని... ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రస్తుతం 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని.. ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి

అమరావతి: గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

మొదటి పేజి తరువాయి

16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే 'గొడ్డలి పార్టీ' పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

భూ రికార్డుల ప్రక్షాళన.. రాజముద్రతో పాస్‌పుస్తకాలు

భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. "మేం అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి భూ యాజమాన్య హక్కుల్ని కాపాడాం. భూమి మీద, కానీ ఫొటోలు వారివి ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై కూడా వారి బొమ్మలు వేసుకున్నారు" అని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి పటిష్టమైన చర్యలతో, కరెన్సీ నోట్ల తరహా భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 26.46 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేశామని, నిర్దేశిత గడువులోగా మొత్తం 90 లక్షల పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తెచ్చి, 1.37 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను



22ఏ నుంచి తప్పించామని పేర్కొన్నారు.

రెండేళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమం

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో సభలు పెడుతున్నామన్నారు. "అభివృద్ధిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. అందుకే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి, యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో చెప్పిన వాటికంటే అదనంగానే ఇచ్చాం" అని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం వాటాతో కలిపి రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని చెప్పారు.

గోదావరి జిల్లాలకు పెద్దపీట

దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఉన్న గోదావరి జిల్లాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, తాము 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నామని, ఫీడ్ ధరల పెరుగుదల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

గొడ్డలి పార్టీకి రాజకీయాలు చేసే అర్హత లేదు

తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన వినుకొండ మాజీ ఎమ్మెల్యేను వైసీపీ అధ్యక్షుడు ఎందుకు సస్పెండ్ చేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత 'గొడ్డలి పార్టీ'కి లేదని, వారు రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే గంజాయి బ్యాచ్‌లను, గొడ్డలి పార్టీ వ్యక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారు.

## జూన్ 15 తర్వాత తేలుస్తా..బరాబర్ జవాబిస్తా

మొదటి పేజి తరువాయి



"తెలంగాణ ప్రజలతో గోక్కున్నవాడు ఎవరూ బాగుపడలేదు" అంటూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కాళ్లల్లో కట్టెలు పెట్టి ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. "రీజనల్ రింగ్ రోడ్డు అనుమతుల కోసం నేను యాభై సార్లు ఢిల్లీకి వెళ్లాను, ప్రధానిని కలిశాను. దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్ రెడ్డికి లేదా? హైదరాబాద్ ప్రజలు ఆయనకు ఓట్లు వేయలేదా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అన్ని అనుమతులు వచ్చాక మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని, మూసీ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, మిగిలిన 25 లక్షల టన్నులను కేంద్రంతో కొనిపించే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని నిలదీశారు. బీజేపీలో ఉంటూనే చీకట్లో ఇతరులతో కిషన్ రెడ్డి సహకారం తీసుకుంటున్నారని, గతంలో కుమ్మక్కు రాజకీయాలు చేసినందుకే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి విషయంలో తాను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని సీఎం స్పష్టం చేశారు. "నిజంగా నేను రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ నేత బండారు లక్ష్మారెడ్డి తండ్రిగారైన బండారు రాజిరెడ్డి పేరును ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టేవాడిని కాదు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తించాం" అని తెలిపారు. అభివృద్ధి కోసం కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో కిషన్ రెడ్డికి గండపెండేరం తొడుగుతామని, కానీ ఆయన సహకరించడం లేదని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం వల్లే తాను ఈరోజు ముఖ్యమంత్రిగా ఉన్నానని, కొడంగల్‌లో ఓడిపోయిన తనను ఇక్కడి ప్రజలే ఆశీర్వదించి గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. మల్కాజిగిరిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే పరిపాలన సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. మూసీ ప్రక్షాళన రెండో దశను నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపడతామని, వంద రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేద్దామని, ఇప్పుడు నగరాభివృద్ధికి అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇరాన్‌కు వెళ్లొద్దు.. ఆ దేశంలో ఉన్నవారు వెంటనే వచ్చేయండి భారతీయులకు కేంద్రం సూచన

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నాం" అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా పచ్చజెండా ఊపడంతోనే ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబుల వంటి నిషేధిత ఆయుధాలను వాడుతూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖొమైనీ, ఇతర సైనిక ఉన్నతాధికారులు మరణించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పలుచోట్ల డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, శాంతి స్థాపన కోసం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి.

## 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణం

హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## మమతకు భారీ షాక్: టీఎంసీకి, ఎంపీ పదవికి సీనియర్ నేత రాజీనామా

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా, ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్ రే సోమవారం తన ఎంపీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా, 2011 నుంచి పార్టీలో కీలక పాత్ర పోషించిన సుఖేందు నిష్క్రమణ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం పార్లమెంటుకు చేరుకున్న సుఖేందు శేఖర్, తన రాజీనామా లేఖను సమర్పించారు. అదేవిధంగా పార్టీని వీడుతున్నట్లు తెలుపుతూ అధినేత్రి మమతా బెనర్జీకి కూడా రాజీనామా లేఖను అందజేశారు. టీఎంసీ పాలనలో పెచ్చరిల్లిన అవినీతి, మహిళల భద్రతలో వైఫల్యం, విద్య, ఆరోగ్య వంటి కీలక రంగాల్లో వెనుకబాటుతనం వంటి అంశాలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. ప్రజలు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును గౌరవిస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బెంగాల్‌లో నూతనంగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేయడాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను బీజేపీ 207 స్థానాలను కైవసం చేసుకుని, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రమయ్యాయి. సుమారు 60 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని, వారంతా బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సుఖేందు రాజీనామా, రానున్న రోజుల్లో పార్టీలో మరిన్ని రాజీనామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే సంకేతాలిస్తోంది. విపక్ష 'ఇండియా' కూటమి సమావేశం కోసం మమతా బెనర్జీ ఢిల్లీ పర్యటనలో ఉన్న సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటును పరిశీలించండి

అమరావతి: రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఉన్న ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్, రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి నారా లోకేశ్ రష్యాకు చెందిన రేర్‌ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులను కోరారు. రష్యా పర్యటనలో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులతో లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "భారత్‌లో విస్తరిస్తున్న ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేసేందుకు గిరెడ్మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని వినియోగించి, నెల్లూరులో ఫుల్ సైకిల్ రేర్‌ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మ్యాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగస్వాములు కావాలి. భారత్ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్ ప్లే ప్రయోగశాలలు వినియోగించి మెటలర్జీ అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ ఏర్పాటుకు చొరవ చూపండి. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి అరుదైన లోహాలు వెలికితీసేందుకు, సాంకేతికతను అందించడంలో భాగస్వాములు కావాలి" అని కోరారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియంను లోకేశ్ సందర్శించారు. మాస్కో ప్రభుత్వం, రొసాటమ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా.. శాంతియుత అణు వినియోగ విజయాలనూ వివరిస్తుంది. 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఈ మ్యూజియం ఏర్పాటైంది. సోవియట్ అణు ప్రాజెక్టు ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు వివిధ అంశాలను ఈ మ్యూజియంలో ప్రదర్శిస్తారు. ఇప్పటివరకు 80 దేశాలకు చెందిన 35 లక్షల మంది ఈ ప్రదర్శనశాలను సందర్శించారని నిర్వాహకులు మంత్రి లోకేశ్‌కు వివరించారు.

## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం!

హైదరాబాద్: హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డులో 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన రాము నాయక్ అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తుండగా.. రాము నాయక్ భూలీలలు బయటకు వచ్చాయని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఆ తర్వాత 2025లో ఆ భూమి మరొకరి పేరిట మారినట్లు విచారణలో తేలిందని పొంగులేటి తెలిపారు. భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాము నాయిక్ భూదందాలపై 2017 నుంచే పలు కేసులు ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పాలకులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 గజాలు, లక్ష్మిగూడలో 130 గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 గజాల స్థలాలను రాము నాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని.. వాటన్నింటిపై విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కేసుల్లో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించామన్నారు. రాము నాయక్‌పై విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని తెలిపారు. రాము నాయక్ భూఅక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించామని.. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఆక్రమణలకు సహకరించినా ఉపేక్షించేది లేదని, ఏ హోదాలో ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యహరిస్తామని.. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.

## పెళ్లికి ముందు లైంగిక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

ఢిల్లీ: ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే అభ్యర్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకొన్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్ బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొంది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు 'ఇండియా' కూటమి డిమాండ్..

కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో మొత్తం 25 ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు పాల్గొని భవిష్యత్తు వ్యూహాలపై చర్చించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కూటమి తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలను ఖర్గే ప్రకటించారు.

1. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జరిగిన లోపాలు, 'ఓట్ల దోపిడీ' అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ లేఖను వీలైనంత త్వరగా ఆయనకు అందజేయనున్నారు. 2. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలోనే నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని.. దీనివల్ల లక్షలాది మంది యువత భవిష్యత్తు రోడ్డున పడిందని మండిపడ్డారు. ఇందుకు బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. 3. దేశంలోని తీవ్ర ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, రైతుల సమస్యలపై కూటమి తరఫున నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. 4. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఇకపై ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా తదుపరి కూటమి సమావేశాన్ని వచ్చే ఆగస్టులో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కచ్చితమైన తేదీని త్వరలోనే ఖరారు చేస్తారు. 5. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై నడవాలని నిర్ణయించాయి. ఇందుకోసం పార్లమెంట్ జరుగుతున్న ప్రతిరోజు ఉదయం లోక్‌సభ ప్రతిపక్ష నేత కార్యాలయంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

